

రైతులందరికీ రుణమాఫీ

అర్హులైన ప్రతి రైతుకు రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. - 8లో

సాగర్ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం :	590 అడుగులు
ప్రస్తుత నీటి మట్టం	: 589.80 అడుగులు
ఇన్‌ఫ్లో	: 48,872 క్యూసెక్కులు
అవుట్ ఫ్లో	: 48,872 క్యూసెక్కులు
విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా	: 29029 క్యూసెక్కులు
కుడికాల్వ ద్వారా	: 9076 క్యూసెక్కులు
ఎడమకాల్వ ద్వారా	: 8367 క్యూసెక్కులు
ఏఎమ్మార్పీకి	: 1,800 క్యూసెక్కులు
వరద కాల్వకు	: 600 క్యూసెక్కులు

మూసీ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం :	645 అడుగులు
ప్రస్తుత నీటి మట్టం:	643.60 అడుగులు
ఇన్‌ఫ్లో	: 1,650 క్యూసెక్కులు
అవుట్ ఫ్లో	: 2009.96 క్యూసెక్కులు
ఎడమకాల్వకు	: 216.27 క్యూసెక్కులు
కుడికాల్వకు	: 168.21 క్యూసెక్కులు
సీపేజీ, లీకేజీ ద్వారా	: 11.15 క్యూసెక్కులు

న్యూస్‌రీల్

ఖైదీలు సత్ప్రవర్తన కలిగి ఉండాలి



ఖైదీలతో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి పి.శ్రీవాణి

చివ్వెంల(సూర్యాపేట) : ఖైదీలు సత్ప్రవర్తన కలిగి ఉండాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, జిల్లా కోర్టు సీనియర్ సివిల్ జడ్జి పి.శ్రీవాణి అన్నారు. శనివారం సూర్యాపేట పట్టణంలోని సబ్ జైలును ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జైలు పరిసరాలు, వంట గది, ఖైదీల పడక గదులను పరిశీలించారు. అనంతరం ఖైదీలతో మాట్లాడి ఏయే కేసుల్లో జైలులో ఉన్నారో అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్షణికావేశంలో చేసిన తప్పిదాల వల్ల జైలులో ఉండాల్సి వస్తుందని, దీనివల్ల కుటుంబ సభ్యులకు దూరంగా ఉంటూ వారిని ఇబ్బందులకు గురిచేసిన వారవుతున్నారన్నారు. అడ్వకేట్‌లను పెట్టుకునే స్తోమత లేని ఖైదీలు జిల్లా న్యాయసేవాధికార సంస్థకు దరఖాస్తు చేసుకున్నట్లయితే అడ్వకేట్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం ఖైదీలు తినే భోజనం తనిఖీ చేసి, స్వయంగా తిని చూశారు. కార్యక్రమంలో డిఫెన్స్ కౌన్సిల్ సభ్యులు వసంత సత్యనారాయణ పిళ్లే యాదవ్, వెంకటరత్నం, ప్రవీణ్ కుమార్, పెండెం వాణి, సూపరింటెండెంట్ పద్మజ, జైలు సిబ్బంది పాల్గొన్నారు.

జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా రాజ్యలక్ష్మి

సూర్యాపేట టౌన్ : జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ గా డాక్టర్ కె.రాజ్యలక్ష్మిని నియమిస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. రాజ్యలక్ష్మి ప్రస్తుతం ఉస్మానియా మెడికల్ కళాశాల గైనకాలజీ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. డాక్టర్ కె.రాజ్యలక్ష్మి రెండు మూడు రోజుల్లో బాధ్యతలు స్వీకరించనున్నారు. ప్రస్తుతం ఆస్పత్రి ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ గా డాక్టర్ శ్రీకాంత్ భట్ విధులు నిర్వర్తిస్తున్నారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోండి



పాఠకులతో మాట్లాడుతున్న బాలమ్మ


అర్వపల్లి: గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని ఉమ్మడి జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బాలమ్మ కోరారు. జాజిరెడ్డిగూడెం మండల కేంద్రంలోని గ్రంథాలయాన్ని శనివారం ఆమె తనిఖీ చేశారు. గ్రంథాలయ నిర్వహణ సక్రమంగా లేకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గ్రంథాలయాల్లో పోటీ పరీక్షలకు సంబంధించి అన్ని పుస్తకాలను అందుబాటులో ఉంచామన్నారు. కాగా జాజిరెడ్డిగూడెం గ్రంథాలయంలో నిలిచిపోయిన టాయిలెట్ల నిర్మాణం, ఇతర అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయించాలని పాఠకులు కోరారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది కుంభం చిన్నసోమయ్య తదితరులు పాల్గొన్నారు.

సాదాబైనామాకు మోక్షం!

- హక్కుల్లేక ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- కొత్త ఆర్ఓఆర్ చట్టంతో త్వరలో రెగ్యులరైజేషన్
- వివాదాలుంటే విచారణ తర్వాతే మ్యుటేషన్
- అప్పటి వరకు పెండింగ్‌లో పెట్టేలా చర్యలు
- ఉమ్మడి జిల్లాలో 25,430 సాదాబైనామాలు



సాదాబైనామా దఖాస్తులు జిల్లాల వారీగా..



సాక్షి ప్రతినిధి, నల్లగొండ: సాదాబైనామా సమస్యలకు కొత్త ఆర్ఓఆర్ చట్టంతో మోక్షం లభించనుంది. భూమి కొనుగోళ్లకు సంబంధించి సాదా కాగితంపై రాసుకున్న వారినుంచి రిజిస్ట్రేషన్లు చేసుకునేందుకు మూడేళ్ల క్రితం గత ప్రభుత్వం దరఖాస్తులు స్వీకరించింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 25,430 సాదాబైనామా దరఖాస్తులు వచ్చాయి. అయితే అప్పట్లో ఆ సమస్యను పరిష్కరించడంలో జాప్యం జరిగింది. దీంతో అప్పటి నుంచి ధరణి దరఖాస్తుదారులు ఎదురుచూస్తున్నారు. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ధరణి సమస్యలు పరిష్కరించేందుకు కొత్త ఆర్ఓఆర్ చట్టం-2024లో అంశాలను పొందుపరచడంతో సాదాబైనామా దారుల్లో ఆశలు చిగురిస్తున్నారు.

ధరణిలో ఆప్షన్లు లేక..

గత ప్రభుత్వం 2020లో కొత్త రెవెన్యూ చట్టాన్ని తీసుకొచ్చింది. ధరణి తీసుకొచ్చి దాని ద్వారానే భూ నిర్వహణను కొనసాగించింది. అయితే ధరణిలో అన్ని రకాల ఆప్షన్లు లేకపోవడంతో రైతులు చాలా ఇబ్బందులు పడ్డారు. అందులో భాగంగానే సాదాబైనామాలు కూడా ఒకటి. ధరణిలో సాదాబైనామా దరఖాస్తులకు సంబంధించి రిజిస్ట్రేషన్ల కోసం ఆప్షన్లు లేకపోవడంతో చాలా మంది సాదాబైనామా దారులు ప్రభుత్వానికి విజ్ఞప్తులు చేశారు. దీనిపై ప్రజాప్రతినిధులు పలు విజ్ఞప్తులు చేయడంతో ప్రభుత్వం సాదాబైనామాలు పూర్తిచేస్తామని మూడేళ్ల క్రితమే దరఖాస్తులు స్వీకరించింది.

కొత్త చట్టంలో అమలుకు..

రాష్ట్ర ప్రభుత్వం తాజాగా రెవెన్యూ హక్కుల చట్టం-2024లో సాదాబైనామాలు అమలు చేస్తామని పొందుపరిచింది. దీంతో సాదాబైనామాదారుల్లో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ఎలాంటి సమస్యలు లేని సాదాబైనామాలన్నింటినీ మొదట పరిష్కరిస్తామని ప్రభుత్వం పేర్కొంది. సమస్యలుంటే విచారణ చేసిన తర్వాతే పరిష్కరిస్తామని తెలిపింది. మొత్తానికి కాంగ్రెస్ ప్రభుత్వం సాదాబైనామాల అమలుకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో సాదాబైనామాదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో దరఖాస్తులు ఇలా..

గ్రామీణ ప్రాంతాల్లో కొన్నేళ్ల క్రితం భూములు కొనుగోలు చేసిన వారు సాదా కాగితంపై అగ్రిమెంట్ రాయించుకున్నారు. కానీ, రిజిస్ట్రేషన్లు చేయించుకోని వారు చాలా మంది ఉన్నారు. ధరణికి ముందున్న ఆర్ఓఆర్ చట్టంలో సాదాబైనామాలతో కూడా పట్టాలు చేశారు. ధరణి వచ్చిన తర్వాత ఆగిపోయాయి. అయితే వాటిని అమలు చేసేందుకు గత ప్రభుత్వం దరఖాస్తులు స్వీకరించగా ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 25,430 దరఖాస్తులు వచ్చాయి. మీ సేవ ద్వారా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. అయితే గత ప్రభుత్వం అమలులో జాప్యం చేయడం, ఆ తర్వాత ఎన్నికలు రావడంతో అవి మూలన పడ్డాయి.



కృష్ణాష్టమి వేడుకలు

జిల్లా కేంద్రంలోని జీఆర్ వివేకావాణి విద్యా మందిర్‌లో శనివారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు కృష్ణుడు, గోపికల వేషధారణలతో అలరించాయి.

రైతుల శ్రేయస్సుకు చిత్తశుద్ధితో పనిచేస్తున్నాం

- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



గోదామును ప్రారంభించి ఎరువులను పరిశీలిస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

మఠంపల్లి: రాష్ట్రంలో రైతుల శ్రేయస్సు కోసం కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని రాష్ట్ర భారీ నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మఠంపల్లి మండలంలోని రఘునాథపాలెంలో నూతనంగా నిర్మించిన పీఏసీఎస్ గోదామును శనివారం మంత్రి ప్రారంభించి మాట్లాడారు. వ్యవసాయానికి సాగునీరు అందించేందుకు ప్రాజెక్టులు నిర్మించి ఆదుకుంటున్నామన్నారు. మఠంపల్లి ప్రాంతంలో అంతర్రాష్ట్ర రహదారిని 10 మీటర్ల వెడల్పుతో హైవే రోడ్డులాగా నిర్మిస్తామని హామీ ఇచ్చారు. రైతులు కూడా ప్రభుత్వం నిర్మించిన ఎత్తిపోతల పథకాలు సక్రమంగా నడిచేలా పర్యవేక్షించుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. రాష్ట్రంలో 6 లక్షల ఎకరాల ఆయకట్టుకు చిన్ని నీటి పారుదల శాఖ ద్వారా రూ.15వేల కోట్లతో మరిన్ని ఎత్తిపోతల పథకాలను చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ ఎత్తిపోతల పథకాల్లో ఔట్‌సోర్సింగ్ విధానంలో ప్రభుత్వమే ఉద్యోగులను నియమించనున్నట్లు తెలిపారు. హుజూర్‌నగర్ పట్టణానికి 10 కిమీ.పరిధిలో ఇళ్లు లేని నిరుపేదలకు హౌజింగ్ కాలనీలో ఇళ్లు కేటాయిస్తానన్నారు. రఘునాథపాలెంలో షాదీఖానాకు రూ.కోటి, జనరల్ కమ్యూనిటీ హాల్‌కు రూ.కోటి, బస్ షెల్టర్‌కు రూ.5 లక్షలు కేటాయిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్, వైస్ చైర్మన్లు రామచంద్రయ్య, బాబునాయక్, నాయకులు శివారెడ్డి, మంజీనాయక్, అప్పయ్య, కిశోర్ రెడ్డి, బచ్చలకూరి బాబు, సీతారామయ్య, నిజాం, వెంకటనారాయణ, లక్ష్మయ్య, పున్నయ్య, అచ్చయ్య, భద్రారెడ్డి, సామేలు, పకీరా అహ్మద్, నాగుల్‌మీరా తదితరులు పాల్గొన్నారు.



'మడిషన్నాక కూసింత కళాపోషణ ఉండాలా..' అని ఓ తెలుగు సినిమాలో సినీనటుడు రావు గోపాలరావు చెప్పినట్లు.. ఉమ్మడి జిల్లాకు చెందిన రాజకీయ నాయకులు వెండితెరపై తళుక్కున మెరిసి తమలోని కళానైపుణ్యాన్ని చాటుకున్నారు. మోత్కుపల్లి నర్సింహులు, కంచర్ల భూపాల్‌రెడ్డి నిజ జీవితంలో మాదిరిగానే సినిమాల్లో కూడా ప్రజాప్రతినిధులుగా.. అద్దంకి దయాకర్ లీడర్‌గా పాత్రలు పోషించి తమ నటనాకౌశలంతో ప్రేక్షకులను మెప్పించారు. వెండితెరపై కనిపించిన మన నాయకులపై ప్రత్యేక కథనం..

సినిమాల్లోనూ లీడర్, ప్రజాప్రతినిధులుగా నటించిన అద్దంకి దయాకర్, మోత్కుపల్లి నర్సింహులు, కంచర్ల భూపాల్‌రెడ్డి

తమ నటనాకౌశలంతో ప్రేక్షకులను మెప్పించిన నేతలు

వెండితెరపై మన నాయకులు

సండే స్పెషల్

స్వీయ పాత్రలో అద్దంకి దయాకర్..

అర్వపల్లి: సమకాలీన రాజకీయ అంశాలు, యథార్థ సంఘటనలు, ప్రేక్షకుల్లో సామాజిక, రాజకీయ చైతన్యం కలిగించేలా బొమ్మకు మురళి దర్శకత్వంలో తెరకెక్కిస్తున్న ఇండియా ఫైల్స్ చిత్రంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, తుంగతుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ మాజీ ఇన్‌చార్జ్, సూర్యాపేట జిల్లా ఆత్మకూర్(ఎస్) మండలం నెమ్మికల్ గ్రామానికి చెందిన అద్దంకి దయాకర్ స్వీయ పాత్రలో నటిస్తున్నారు. నటి ఇంద్రజ కూడా ఇందులో నటిస్తోంది. భారతదేశంతో పాటు మొత్తం నాలుగు దేశాలకు సంబంధించిన భాషల్లో ఈ సినిమాను తీస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమా ఆడియో రిలీజ్ కాగా డిసెంబర్‌లో సినిమా విడుదల చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సినిమాలో ప్రజాగాయకుడు గద్దర్ చివరిసారిగా నటించడంతో పాటు ఆయన చివరి పాట కూడా ఉంది. ఇండియాకు సంబంధించిన 10వేల సంవత్సరాల చరిత్రను క్లుప్తంగా ఈ సినిమాలో తెరకెక్కిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమా 90శాతం షూటింగ్ పూర్తి చేసుకుంది.



ఇండియా ఫైల్స్ చిత్రంలో అద్దంకి దయాకర్, ఇంద్రజ



ఇండియా ఫైల్స్ చిత్రం సన్నివేశంలో అద్దంకి

ముఖ్యమంత్రి పాత్రలో మోత్కుపల్లి..



తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే మోత్కుపల్లి నర్సింహులు 2007లో పోసాని కృష్ణమురళి దర్శకత్వంలో హీరో శ్రీకాంత్ నటించిన ఆపరేషన్ దుర్యోధన సినిమాలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రత్యేక పాత్ర పోషించారు. అవినీతిని అరికట్టేందుకు సహకరించే సీఎం పాత్రలో ఆయన నటించి మెప్పించారు.

ఎమ్మెల్యేగా నటించి..



నల్లగొండ: నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి నల్లగొండకు చెందిన చిన్ని చరణ్ దర్శకత్వం వహించిన అదీ లెక్క సినిమాలో ఎమ్మెల్యే పాత్రలో నటించారు. ఈ సినిమా 2016లో విడుదలయ్యింది. ఈ సినిమాలో ఎమ్మెల్యే పాత్రలో నటించిన భూపాల్‌రెడ్డి 2018 అసెంబ్లీ ఎన్నికల్లో నల్లగొండ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా విజయం సాధించడం విశేషం.

సినీ నిర్మాతగా యుగంధర్‌రావు



తుంగతుర్తి నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, సూర్యాపేట జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ గుజ్జ దీపిక భర్త గుజ్జ యుగంధర్ రావు బందూక్ అనే సినిమాను నిర్మించారు. ఈ సినిమా 2015 జూన్ 19న విడుదలయ్యింది.

సర్వేయర్లా.. మజాకా..!

- సర్వే కోసం దరఖాస్తు చేసుకుంటే ముప్పతిప్పలు
- అడిగినంత ఇచ్చినా రకరకాల కొర్రీలు
- ఆక్రమణదారులతో కుమ్మక్కవుతున్న సర్వేయర్లు



'కోదాడ నియోజకవర్గ పరిధిలో ఆయకట్టు మండలానికి చెందిన ఓ రైతుకు తన పక్క పొలం రైతుతో గెట్టు వివాదం వచ్చింది. సమస్య పరిష్కారానికి మండల రెవెన్యూ కార్యాలయంలో చలానా కట్టి సర్వేకు దరఖాస్తు చేసుకున్నాడు. అయితే కార్యాలయంలో సర్వేయర్ల కొరత ఉందని.. సర్వేకు రావడం ఆలస్యం అవుతుందని చెప్పడంతో సర్వేయర్ అడిగినంత రైతు సమర్పించుకున్నాడు. అనంతరం సర్వేయర్ వచ్చి భూమిపై చెత్తాచెదారం ఉంది.. సర్వే చేయనని చెప్పి వెళ్లిపోయాడు. తిరిగి సర్వే చేయాలంటే తన చేయి మళ్లీ తడపాలని డిమాండ్ చేస్తుండడంతో ఆ రైతు సదరు సర్వేయర్‌పై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశాడు. దీంతో నాలుగు నెలలు అవుతున్నా ఆ రైతు పొలాన్ని సర్వే చేయకుండా కార్యాలయం చుట్టూ తిప్పుతున్నారు.' ఇదీ ఈఒక్క రైతు సమస్యే కాదు.. జిల్లావ్యాప్తంగా వేల మంది రైతులు, భూ యజమానుల సమస్య.



సర్వేయర్ల మాయాజాలానికి కోదాడ ప్రభుత్వ వైద్యశాల స్థలమే మచ్చుతునక. కోదాడ ప్రభుత్వ వైద్యశాలకు 1969వ సంవత్సరంలో ఒకరు రెండెకరాల స్థలం దానం ఇచ్చారు. అందులో ప్రభుత్వ వైద్యశాలను అప్పుడే లే అవుట్ చేసి నిర్మించారు. చుట్టూ ప్రహరీ కూడా నిర్మించారు. ఇటీవల దాత వారసుడు తన తాత దానం ఇచ్చిన భూమికన్నా అందులో ఎక్కువగా ఉందని చెప్పడంతో.. ఆ భూమిని సర్వే చేయాలని కలెక్టర్ ఆదేశించారు. మూడుమార్లు సర్వే చేసిన అధికారులు.. ఒకసారి రెండు ఎకరాలకు తక్కువగా ఉందని, మరోసారి రెండు ఎకరాలకు ఎక్కువగా ఉందని రిపోర్టు ఇచ్చారు. దీని ఆధారంగా రెవెన్యూ అధికారులు ప్రభుత్వ వైద్యశాల స్థలంలో 550 గజాల స్థలాన్ని దాత వారసుడికి అప్పగించారు. దీని విలువ దాదాపు రూ.5 కోట్లు. ఇటీవల వంద పడకల వైద్యశాల నిర్మాణం కోసం స్థలాన్ని అధికారులు సర్వే చేయగా.. కాంపౌండ్ లోపల కేవలం ఎకరం 25 గుంటల స్థలం మాత్రమే ఉంది. ఇదే స్థలంపై నాలుగుమార్లు నాలుగు రకాల సర్వే రిపోర్టులు ఇచ్చిన సర్వేయర్లపై కనీస చర్యలు తీసుకోలేదు.

కోదాడ: భూముల ధరలు పెరగడంతో భూ వివాదాలు, గెట్టు పంచాయితీలు పెరిగిపోయాయి. అదే సమయంలో జిల్లావ్యాప్తంగా ప్రతి మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఉండాల్సిన సర్వేయర్లు సగం మండలాలకు కూడా లేరు. ఒక్కో సర్వేయర్‌కు రెండు మూడు మండలాల సర్వే పనులు చూడాల్సి రావడంతో వీరికి విపరీతమైన డిమాండ్ పెరిగింది. ఇదే అదనుగా సర్వేయర్లు సొమ్ము చేసుకుంటున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

ఆక్రమణదారులకు అనుకూలంగా రిపోర్టులు..

జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ భూములు, ఆలయాల భూములు చాలా వరకు ఆక్రమణకు గురయ్యాయి. ఈ ఆక్రమణలు అడ్డుకోవడానికి సర్వేయర్లు ఇచ్చే రిపోర్టులే కీలకం. ఇతరులకు దీనిపై అవగాహన లేకపోవడంతో సర్వేయర్లు ఏ రిపోర్టు ఇస్తే అదే వాస్తవంగా పరిగణించాల్సి వస్తుందని పలువురు రెవెన్యూ అధికారులు అంటున్నారు. ఆక్రమణలపై ఆయా గ్రామాలకు చెందిన వారు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో వారు సర్వేకు ఆదేశిస్తున్నారు. రంగంలోకి దిగుతున్న సర్వేయర్లు.. పలుచోట్ల ఆక్రమణదారులతో కుమ్మక్కై వారికి అనుకూలంగా సర్వే రిపోర్టులు ఇస్తుండడంతో ఆక్రమణలపై ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేకపోతున్నారని సమాచారం. ఇటీవల జిల్లా వ్యాప్తంగా చెరువుల శిఖం భూముల ఆక్రమణ పెరగడానికి కూడా తప్పుడు సర్వే రిపోర్టులే కారణమని తెలుస్తోంది.

నాలా కన్వర్షన్‌లు వస్తే పండుగే..

జిల్లావ్యాప్తంగా రియల్ ఎస్టేట్ వ్యాపారం పెరగడంతో పలువురు తమ వ్యవసాయ భూములను, వ్యవసాయేతర భూములుగా (నాలా కన్వర్షన్) మార్చుకుంటున్నారు. నాలా కన్వర్షన్ చేయాలంటే దానికి సర్వేయర్ లొకేషన్ మ్యాప్ ఇవ్వాల్సి ఉంటుంది. దీనికోసం వీరు ఎకరాకు రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు డిమాండ్ చేస్తున్నట్లు పలువురు వాపోతున్నారు. రైతుల పొలాలను సర్వే చేయాలంటే సవాలక్ష కొర్రీలు పెడుతున్న సర్వేయర్లు.. పట్టణాల నడిబొడ్డున ఉన్న ప్రైవేట్ వ్యక్తులకు సంబంధించిన వివాదాస్పద భూముల సర్వేలు మాత్రం గంటల్లో చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. సర్వేయర్లకు వారు భారీగా ముడుపులు ముట్టజెప్పడంతోనే సర్వే తొందరగా చేస్తున్నారని, కానీ కార్యాలయాల్లో నిబంధనల ప్రకారం చేసుకున్న దరఖాస్తులను పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు

బ్యాంక్ లింకేజీ టార్గెట్ పూర్తి చేయండి

- కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

భానుపురి (సూర్యాపేట) : బ్యాంకు లింకేజీ టార్గెట్ వంద శాతం పూర్తి చేయాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో సెర్ప్ సిబ్బందితో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. సెర్ప్ సిబ్బంది రాజీలేని సిద్ధాంతాల పట్ల నిర్లక్ష్యం వహించొద్దన్నారు. మండలాల్లో వినూత్న ఔత్సాహిక మైక్రో ఎంటర్‌ప్రైజెస్ యూనిట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. మహిళల సాధికారతకు సిబ్బంది కృషి చేయాలని పేర్కొన్నారు. సెర్ప్ సిబ్బంది ఉద్యోగులు ఎవరైనా విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రతివారం గూగుల్ మీట్ ద్వారా ఉద్యోగులతో రివ్యూ తీసుకుంటానని కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ అప్పారావు, జిల్లాలోని అన్ని మండలాల ఎంపీడీఓలు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులు సక్రమంగా నిర్వహించాలి

గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు సక్రమంగా నిర్వహించేవిధంగా చూడాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. కలెక్టరేట్‌లో జెడ్పీ సీఈఓ అప్పారావుతో కలిసి ఎంపీడీఓలు, ఎంపీఓలతో శనివారం కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాల్లో సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా పంచాయతీ కార్యదర్శులు పర్యవేక్షణ చేయాలన్నారు. గ్రామాల్లో యాంటీ లార్వా స్ప్రే, ఫాగింగ్ చేసేవిధంగా చూడాలని సూచించారు. ఫాగింగ్ యంత్రాలకు మరమ్మతులు ఉంటే చేయించి వాటిని వినియోగంలోకి తీసుకురావాలన్నారు. పెద్ద గ్రామ పంచాయతీల్లో ఫాగింగ్ యంత్రాలు లేకపోతే కొనుగోలు చేయాలని సూచించారు. గ్రామాల్లో వీధులు, మంచినీటి ట్యాంకులు శుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. ఇంటింటి ఫీవర్ సర్వేలో గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొనాలన్నారు. గ్రామ పంచాయతీ ఓటర్ల జాబితా, వార్డుల విభజనలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశం లో డీఎల్‌పీఓ నారాయణరెడ్డి, ఎంపీడీఓలు, ఎంపీఓలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బైక్‌ను ఢీకొట్టిన లారీ.. ఒకరు మృతి

చిట్యాల: బైక్‌పై వెళ్తున్న వ్యక్తిని ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టడంతో మృతిచెందాడు. ఈ ఘటన చిట్యాల పట్టణ శివారులోని భువనగిరి రోడ్డులో శనివారం జరిగింది. చిట్యాల ఎస్‌ఐ–2 కె. లింగయ్య తెలిపిన వివరాల ప్రకారం.. రామన్నపేట మండలం నీర్నెముల గ్రామానికి చెందిన చిప్పలపల్లి కృష్ణయ్య(55) మేస్త్రీగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. శనివారం అతడు రామన్నపేట నుంచి చిట్యాలకు బైక్‌పై వస్తున్నాడు. చిట్యాల పట్టణ శివారులోని ఐడీఎల్ పరిశ్రమ వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న లారీ బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కృష్ణయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రామన్నపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుమారుడు నాగరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

అదుపుతప్పి కారు బోల్తా.. ఇద్దరికి గాయాలు



గాయపడిన బాధితుడు

చివ్వెంల(సూర్యాపేట): అతివేగంగా వస్తున్న కారు అదుపుతప్పి బోల్తా పడడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ ఘటన చివ్వెంల మండలం గుంజలూరు గ్రామ శివారులో శనివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ నుంచి విజయవాడకు వెళ్తున్న కారు గుంజలూరు గ్రామ శివారులో జాతీయ రహదారిపై అదుపుతప్పి అవతలి వైపు వెళ్లి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన సమయంలో విజయవాడ వైపు నుంచి ఎటువంటి వాహనాలు రాకపోవడంతో ప్రాణాలతో బయటపడ్డారు. స్థానికులు క్షతగాత్రులను 108 వాహనంలో సూర్యాపేట జనరల్ హాస్పిటల్‌కు తరలించారు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ బి. వెంకట్‌రెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్షతగాత్రుల వివరాలు తెలియరాలేదు.

ట్రాక్టర్ తిరగబడి వ్యక్తి మృతి



శోభన్‌బాబు (ఫైల్)

త్రిపురారం: పొలం దమ్ము చేస్తుండగా ట్రాక్టర్ తిరగబడి వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన నిడమనూరు మండలం తుమ్మడం గ్రామ పంచాయతీ పరిధిలో శనివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తుమ్మడం గ్రామ శివారు వద్ద చెరువు సమీపంలో చింతపండు సైదులుకు చెందిన పొలాన్ని గోలి శోభన్ బాబు(35) ఫుల్ వీల్స్ ట్రాక్టర్‌తో శనివారం మధ్యాహ్నం దమ్ము చేస్తున్నాడు. ఈ క్రమంలో ట్రాక్టర్ పొలంలో దిగబడి ఫుల్ వీల్స్‌లు మట్టిలో కూరుకుపోయాయి. ట్రాక్టర్‌ను బయటకు తీయడానికి ఇనప చక్రాల మధ్యలో కర్రలు పెట్టి ప్రయత్నిస్తుండగా.. కర్రలు జారిపోవడంతో ట్రాక్టర్ తిరగబడింది. దీంతో శోభన్‌బాబు ట్రాక్టర్ కింద ఇరుక్కుపోయాడు. చుట్టుపక్కల రైతులు వెంటనే అతడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించి జేసీబీ సహాయంతో పల్టీకొట్టిన ట్రాక్టర్‌ను తీయగా.. శోభన్‌బాబు అప్పటికే మృతిచెందాడు. నిడమనూరు ఏఎస్‌ఐ రమేష్ ఘటనా స్థలానికి చేరుకుని వివరాలను సేకరించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. మృతుడు కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

2029లో దేశంలో కాంగ్రెస్‌దే అధికారం

- నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



చౌటపల్లిలో రాజగోపుర నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

మఠంపల్లి: దేశంలో 2029 సంవత్సరంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రాహుల్‌గాంధీ ప్రధాన మంత్రి కావడం ఖాయమని రాష్ట్ర భారీ నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. శనివారం రాత్రి మఠంపల్లి మండలం చౌటపల్లి గ్రామంలో రూ.50 లక్షలతో నిర్మించనున్న శ్రీ రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి ఆలయ రాజగోపురానికి శంకుస్థాపన చేశారు. అనంతరం జరిగిన సభలో మంత్రి మాట్లాడారు. దేశంలో మోదీ ప్రభుత్వం ప్రతిపక్ష నాయకులపై ఎన్ని సీబీఐ, ఈడీ కేసులు పెట్టి జైళ్లపాలు చేసినా భయపడేది లేదన్నారు. బీజేపీకి, మోదీకి జనాదరణ తగ్గుతూ వస్తోందన్నారు. గత పదేళ్లు రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతులకు కేవలం రూ.66 కోట్లు మాత్రమే చెల్లించిందని, కానీ ఇప్పుడు ఏవేవో మాట్లాడుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ఏడాది బడ్జెట్‌లోనే రైతులకు రూ.26 వేల కోట్లు కేటాయించి గడచిన ఎనిమిది నెలల్లో ఏకంగా రూ.18వేల కోట్లు రుణమాఫీ చేసిందన్నారు. రాష్ట్రంలో రూ.2 లక్షల మాఫీ వర్తించని రైతులు ఆయా మండలాల్లోని వ్యవసాయ అధికారులకు దరఖాస్తు చేసుకుంటే పూర్తిగా మాఫీ చేస్తామన్నారు. ×రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రిగా చెబుతున్నా.. రాష్ట్రంలో తెల్ల రేషన్‌కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ వచ్చే జనవరి నెల నుంచి సన్నబియ్యం అందించబోతున్నాం×అని తెలిపారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శివారెడ్డి, మంజీనాయక్, డీవీఆర్, కిశోర్‌రెడ్డి, అరుణ, సైదులు, ఆర్డీఓ శ్రీనివాసులు, తహసీల్దార్ మంగారాథోడ్, ఎండోమెంట్ అసిస్టెంట్ కమిషనర్ సులోచన, ఈఓలు లక్ష్మణ్‌రావు, కొండారెడ్డి, ఎండోమెంట్ డీఈ రాజయ్య, అధికారులు గోవిందరెడ్డి, కిరణ్, మాజీ జెడ్పీటీసీ అరుణసైదులు, మాజీ ఎంపీపీ లక్ష్మీవెంకటనారాయణ, మాజీ సర్పంచ్ సీతారావిరెడ్డి, రాంరెడ్డి, లింగయ్యయాదవ్, హుస్సేన్‌రెడ్డి, వెంకటప్పయ్య, గోవిందరావు, జహంగీర్, నర్సిరెడ్డి, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతులందరికీ రుణమాఫీ చేస్తాం

- డీసీసీబీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి



మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

మిర్యాలగూడ: అర్హులైన ప్రతి రైతుకు రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని, రైతులెవ్వరూ అధైర్యపడవద్దని డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన మిర్యాలగూడ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని రైతులకే అత్యధిక రుణమాఫీ జరిగిందన్నారు. కొన్ని సాంకేతిక కారణాల వల్ల కొంతమంది రైతులకు రుణమాఫీ కాలేదని, వారందరికి కూడా రుణమాఫీ చేస్తామన్నారు. కొందరు రైతులకు ఆధార్ కార్డు, రేషన్‌కార్డుల్లో తప్పులు ఉండడం వల్ల రుణమాఫీ కాలేదని, వాటిని సరిచేసి రుణమాఫీ చేస్తామన్నారు. గత పదేళ్లలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం రూ.19వేల కోట్లకు గాను కేవలం రూ.7వేల కోట్లు మాత్రమే రుణమాఫీ చేసిందన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు 8 నెలల్లోపే రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేసిందన్నారు. కేంద్ర సహకార బ్యాంకుల ద్వారా గతంలో రూ.లక్ష వరకు రుణాలు ఇచ్చారని, దాన్ని రూ.1.50లక్షలకు పెంచామన్నారు. ఈ సీజన్‌లో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కొత్తగా 11 కేంద్ర సహకార బ్యాంకులు ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు పంపించామని, అందులో దామరచర్ల, సంస్థాన్ నారాయణపురం, ఆత్మకూరు, తిప్పర్తి, గరిడేపల్లికి బ్యాంకుల ఏర్పాటుకు అనుమతి లభించిందన్నారు. మిర్యాలగూడ అర్బన్, చిలుకూరు, నాంపల్లి, చింతపల్లి, ఆత్మకూరు(ఎస్) మండలాల్లో బ్యాంకులు ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు ఉన్నాయన్నారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు పొదిల శ్రీనివాస్, తమ్మడబోయిన అర్జున్, చలపతిరావు, శ్రీనివాస్, గౌస్ తదితరులు ఉన్నారు.

అనుమానాస్పద స్థితిలో విద్యార్థి మృతి

వలిగొండ: అనుమానాస్పద స్థితిలో విద్యార్థి మృతిచెందాడు. ఈ ఘటన వలిగొండ మండలంలోని అరూరులో శనివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అరూరు గ్రామానికి చెందిన లోతుకుంట మణిచరణ్(15) అరూరు జెడ్పీహెచ్‌ఎస్‌లో 10వ తరగతి చదువుతున్నాడు. శనివారం తెల్లవారుజామున 5గంటల సమయంలో వాంతులు, ఒళ్లు నొప్పులతో బాధపడుతున్న బాలుడిని కుటుంబ సభ్యులు స్థానిక ప్రాథమిక ఉప ఆరోగ్య కేంద్రంలో ప్రథమ చికిత్స చేయించి వలిగొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉందని అక్కడి వైద్యుల సూచన మేరకు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే బాలుడు మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. రాత్రివేళ విష కీటకాలు కుట్టడంతోనే బాలుడి మృతికి కారణమై ఉండవచ్చని కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతుడి తల్లి పావని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మహేందర్ లాల్ తెలిపారు.

గురుకుల విద్యార్థిని అదృశ్యం

- పోలీసులకు ఫిర్యాదు చేసిన ప్రిన్సిపాల్
- ఆచూకీ కనిపెట్టిన పోలీసులు

చౌటుప్పల్ రూరల్: చౌటుప్పల్ మండలం తుప్రాన్‌పేట గ్రామంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఇంటర్ చదువుతున్న విద్యార్థిని అదృశ్యమైంది. యాదాద్రి భువనగిరి జిల్లాలోని ఓ మండలానికి చెందిన విద్యార్థిని తుప్రాన్‌పేట గ్రామంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఇంటర్ ఫస్టియర్ చదువుతోంది. ఈ నెల 20వ తేదీ విద్యార్థినికి బాబాయి వరుస అవుతానని చెప్పి ఓ వ్యక్తి ఆమెను పాఠశాల నుంచి తీసుకెళ్లాడు. 22వ తేదీన తిరిగి హాస్టల్‌కు వస్తానని చెప్పిన విద్యార్థిని రాకపోవడంతో హాస్టల్ సిబ్బంది విద్యార్థిని తల్లికి ఫోన్ చేయగా.. ఇంటికి రాలేదని చెప్పారు. దీంతో ప్రిన్సిపాల్ 22వ తేదీన చౌటుప్పల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసి శనివారం విద్యార్థిని ఆచూకీ కనిపెట్టినట్లు సీఐ అశోక్‌రెడ్డి తెలిపారు. హాస్టల్ విద్యార్థులను బయటికి పంపాలంటే తల్లిదండ్రుల అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. కానీ వచ్చిన వ్యక్తి ఎవరని నిర్ధారించుకోకుండానే విద్యార్థినిని బయటకు పంపించారు. దీంతో అప్రమత్తమైన హాస్టల్ సిబ్బంది విషయం బయటికి తెలియకుండా జాగ్రత్త పడినట్లు తెలిసింది. ఈ ఘటనపై గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌ను వివరణ కోరగా.. విద్యార్థిని బంధువని చెప్పి ఓ వ్యక్తి పాఠశాల నుండి ఆమెను తీసుకెళ్లాడని, తిరిగి పాఠశాలకు రాకపోవడంతో అనుమానం వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

హాస్టల్‌లో ఉండడం ఇష్టం లేక విద్యార్థిని ఆత్మహత్య



చందన (ఫైల్)

మునుగోడు: హాస్టల్‌లో ఉండడం ఇష్టం లేక ఇంటికి వెళ్లిన విద్యార్థిని పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన శుక్రవారం రాత్రి మునుగోడు మండలం కల్వకుంట్ల గ్రామంలో జరిగింది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కల్వకుంట్ల గ్రామానికి చెందిన నాంపల్లి చందన (17) మునుగోడులోని మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. ఆమెకు కళాశాల హాస్టల్‌లో ఉండడం ఇష్టం లేక 20రోజుల క్రితం తన తల్లి ధనమ్మను పిలిపించుకొని ఇంటికి వెళ్లింది. అప్పటి నుంచి కళాశాలకు వెళ్లకుండా ఇంటి వద్దే ఉండటంతో శుక్రవారం ఉదయం తల్లి మందలించింది. అనంతరం ఆమె వ్యవసాయ పనులకు వెళ్లింది. హాస్టల్‌లో ఉండడం ఇష్టం లేకపోవడంతో పాటు తల్లి మందలించిందని మనస్తాపానికి గురైన చందన ఇంట్లో పురుగుల మందు తాగింది. సాయంత్రం తల్లి ఇంటికి వచ్చి చూడగా చందన విగతజీవిగా పడి ఉంది. స్థానిక వైద్యులు పరీక్షించగా అప్పటికే ఆమె మృతి చెందింది. మృతురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ అంజయ్య తెలిపారు.

'జిట్టా'ను పరామర్శించిన నాయకులు



జిట్టా బాలకృష్ణారెడ్డి సతీమణి సునీతకు ధైర్యం చెబుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



జిట్టా బాలకృష్ణారెడ్డిని పరామర్శిస్తున్న కేటీఆర్

సాక్షి,యాదాద్రి: తీవ్ర అస్వస్థతకు గురై కొన్నిరోజులుగా సికింద్రాబాద్‌లోని యశోదా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు జిట్టా బాలకృష్ణారెడ్డిని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శనివారం వేర్వేరుగా పరామర్శించారు. జిట్టా ఆరోగ్య పరిస్థితిని, అందుతున్న వైద్య సేవలను డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లను కోరారు. కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వెంట భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, కేటీఆర్ వెంట హుజూరాబాద్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి, భువనగిరి మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

నార్కట్‌పల్లిలో ఎలక్షన్ కమిషనర్



ఎలక్షన్ కమిషనర్ పార్థసారధికి స్వాగతం పలుకుతున్న ఆర్డీఓ రవీందర్

నార్కట్‌పల్లి: తెలంగాణ రాష్ట్ర ఎలక్షన్ కమిషనర్ పార్థసారధి శనివారం నెల్లూరు నుంచి హైదరాబాద్‌కు వెళ్తూ మార్గమధ్యలో నార్కట్‌పల్లిలోని వివేరా హోటల్‌లో టీ తాగేందుకు ఆగారు. ఆయనకు నల్లగొండ ఆర్డీఓ రవీందర్ స్వాగతం పలికారు. వారి వెంట నార్కట్‌పల్లి తహసీల్దార్ వెంకటేశ్వరరావు, ఆర్‌ఐ తరుణ్, గ్రామ కార్యదర్శి శుభనోదిన్ ఉన్నారు.

ఉద్యోగం రాక.. పెళ్లి కుదరక

- మనస్తాపంతో ఉరేసుకుని యువకుడి బలవన్మరణం

భూదాన్‌పోచంపల్లి: ఉద్యోగం లేక, పెళ్లి కుదరక, అనారోగ్య సమస్యలతో మనస్తాపం చెంది యువకుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన శనివారం పోచంపల్లి మున్సిపాలిటీ కేంద్రంలో జరిగింది. ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పోచంపల్లి పట్టణ కేంద్రంలోని 7వ వార్డుకు చెందిన తంగెళ్ల గణేశ్, యాదమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు రాజశేఖర్, సురేశ్ ఉన్నారు. పెద్ద కుమారుడు రాజశేఖర్(29) ఆరేళ్ల క్రితం బీటెక్ పూర్తి చేశారు. ఉద్యోగం కోసం చేసిన ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి. ఇటు పెళ్లి సంబంధాలు కుదరడంలేదు. కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. తమ్ముడు సురేశ్, తల్లి యాదమ్మ హైదరాబాద్‌లోని ఆదిభట్లలో బట్టల దుకాణం పెట్టుకొని అక్కడే ఉంటుండగా, రాజశేఖర్ మాత్రం తండ్రి వద్ద ఉంటూ వ్యవసాయ పనుల్లో చేదోడువాదోడుగా ఉంటున్నాడు. శనివారం తెల్లవారుజామున 5.30 గంటల సమయంలో తండ్రి గణేశ్ వ్యవసాయబావి వద్దకు వెళ్లాడు. ఒంటరిగా ఉన్న రాజశేఖర్ ఇంట్లో తాడుతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పొలం నుంచి ఇంటికి వచ్చిన తండ్రి గణేష్ కుమారుడిని ఎంత పిలిచినా పలకకపోవడంతో అనుమానం వచ్చి కిటికీలోంచి చూడగా రాజశేఖర్ ఉరికి వేలాడుతూ కన్పించాడు. వెంటనే ఇరుగుపొరుగు వారిని పిలిచి వారి సహాయంతో తలుపులు పగులగొట్టి లోనికి వెళ్లి చూడగా అప్పటికే రాజశేఖర్ మృతిచెందాడు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు ఘటనా స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించి పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాన్ని భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఉద్యోగ భద్రత కల్పించాలని వినతి



గుత్తా సుఖేందర్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న గెస్ట్ లెక్చరర్లు

నల్లగొండ: తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని నల్లగొండ జిల్లా గెస్ట్ లెక్చరర్స్ అసోసియేషన్ నాయకులు శనివారం నల్లగొండలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సుఖేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. గెస్ట్ లెక్చరర్లను రెన్యూవల్ చేయడంతో పాటు వారికి ఉద్యోగ భద్రత కల్పించేలా సీఎంకు లేఖ రాస్తానని హామీ ఇచ్చారు. వినతిపత్రం అందజేసిన వారిలో కుక్కునూరు జలంధర్‌రెడ్డి, గుండ్ల వెంకన్న, అల్ఫాస్ సురేష్, నవీన్, రజిత, కక్కిరేణి రాధిక, తకీర్ ఉన్నారు.

రైతు స్థాయిలోనే అధిక సమాచారం



మాట్లాడుతున్న షేక్ ఎన్ మీరా

త్రిపురారం: వ్యవసాయంలో రైతుల స్థాయిలోనే అధిక సమాచారం ఉంటుందని అటారి జోన్–10 డైరెక్టర్ షేక్ ఎన్ మీరా అన్నారు. మండలంలోని కంపాసాగర్‌లో గల కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే)లో అఖిల భారత వరి పరిశోధన సంస్థ(ఐసీఏఆర్) శాస్త్రవేత్తల ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాలోని రైతులకు నేరుగా విత్తే వరి సాగు–యాజమాన్య పద్ధతులపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో విస్తరణ విభాగం సహాయ సంచాలకులు డాక్టర్ స్వర్ణలతాదేవి, భారతీయ వరి పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త మహేంద్రకుమార్, వరి పరిశోధన స్థానం హెడ్ డాక్టర్ లింగయ్య, ఎస్‌బీఐ మేనేజర్ హరిబాబు పాల్గొన్నారు.

- పాల ధారలా కృష్ణమ్మ



సాగర్ జలాశయం నిండుకుండలా మారింది. శనివారం జలాశయం వద్ద బలమైన గాలులు వీయడంతో 26 క్రస్ట్ గేట్ల మీదుగా పాల ధారలా కృష్ణమ్మ కిందకు జారుతూ పర్యాటకులను ఆకట్టుకుంది. - నాగార్జునసాగర్

సభ్యత్వ నమోదులో ముందుంచాలి

- జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి



మాట్లాడుతున్న జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి

నల్లగొండ టూటౌన్: బీజేపీ సభ్యత్వ నమోదులో రాష్ట్రంలోనే నల్లగొండ జిల్లాను మొదటి స్థానంలో ఉంచాలని జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి అన్నారు. శనివారం నల్లగొండలోని బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నల్లగొండ జిల్లాలో సెప్టెంబర్ 5 నుంచి సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభించాలని అన్నారు. సభ్యత్వం తీసుకునేందుకు 8800002024 నంబర్‌కు మిస్డ్‌కాల్ లేదా నమో యాప్, ఆన్‌లైన్ వెబ్‌సైట్, ఆఫ్‌లైన్ ద్వారా సభ్యత్వం పొందవచ్చన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి మాదగాని శ్రీనివాస్‌గౌడ్, సభ్యత్వ సహ ప్రముఖ్ గోలి మధుసూదన్‌రెడ్డి, నాయకులు వీరెల్లి చంద్రశేఖర్, కంచర్ల విద్యాసాగర్ రెడ్డి, బండారు ప్రసాద్, పిల్లిరామరాజు యాదవ్, పోతేపాక సాంబయ్య, నూకల వెంకట్ నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లది దొంగాట..

రాష్ట్రంలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలు దొంగాట ఆడుతున్నాయని తల్లోజు ఆచారి ఆరోపించారు. నల్లగొండలోని బీజేపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఢిల్లీలో కవిత లిక్కర్ కేసును వాదిస్తున్న అభిషేక్ సింఘ్వీకి రేవంత్‌రెడ్డి రాజ్యసభ సీటు ఇచ్చారని, దీనిని చూస్తేనే కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలు ఒకటే అని అర్థమవుతుందన్నారు. నల్లగొండ జిల్లాకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి బడ్జెట్‌లో ఎన్ని నిధులు తెచ్చారో స్పష్టం చేయాలన్నారు.

గిరిజన విద్యార్థులకు పథకాలు అందేలా చూడాలి

- గిరిజన సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శరత్



డైనింగ్ హాల్‌ను పరిశీలిస్తున్న ప్రిన్సిపల్ సెక్రటరీ శరత్

మిర్యాలగూడ: గిరిజన విద్యార్థుల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు వారికి చేరువయ్యేలా చూడాలని గిరిజన సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శరత్ అన్నారు. శనివారం మిర్యాలగూడ మండలం అవంతీపురం గిరిజన గురుకుల బాలుర పాఠశాలను ఆయన సందర్శించి రికార్డులను పరిశీలించారు. పాఠశాలలో ఏడుగురు ఉపాధ్యాయులు గైర్హాజరుకావడం, రికార్డులను సరిగా నిర్వహించకపోవడంతో ప్రిన్సిపాల్‌పై అసహనం వ్యక్తం చేశారు. అనంతరం డైనింగ్ హాల్‌తో పాటు విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు నాసిరకం కూరగాయలతో భోజనం అందించడమేంటని సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోజూ విద్యార్థులకు తాజా కూరగాయలతో నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. మరోసారి ఇలాంటి తప్పిదాలు చేస్తే సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత విద్యనభ్యసించి భవిష్యత్తులో గొప్పస్థాయికి చేరుకోవాలన్నారు. ఆయన వెంట ఆర్‌సీఓ అగస్టీన్, ప్రిన్సిపాల్ అజయ్‌కుమార్, ఉపాధ్యాయులు ఉన్నారు.

ట్రావెల్స్ బస్సు ఢీకొని వ్యక్తి దుర్మరణం

మునగాల: ట్రావెల్స్ బస్సు ఢీకొని వ్యక్తి మృతిచెందిన ఘటన శుక్రవారం అర్ధరాత్రి మునగాల మండలం మొద్దులచెరువు గ్రామ స్టేజీ సమీపంలో జరిగింది. ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తూర్పుగోదావరి జిల్లా గోకవరం మండలం కృష్ణునిపాలెం గ్రామానికి చెందిన మలిరెడ్డి శ్రీనివాసరావు(55) ఇటీవల హైదరాబాద్‌లో ఉంటున్న తన కుమార్తె ఇంటికి వెళ్లాడు. శుక్రవారం రాత్రి 10.30 గంటలకు తన అల్లుడు, కుమార్తెతో కలసి కారులో హైదరాబాద్ నుంచి స్వగ్రామానికి కారులో బయల్దేరాడు. మార్గమధ్యలో మునగాల మండలం మొద్దులచెరువు గ్రామ స్టేజీ వద్ద విజయవాడ–హైదరాబాద్ హైవే పక్కన అర్ధరాత్రి 1.30గంటల సమయంలో మూత్ర విసర్జన కోసం కారు ఆపారు. శ్రీనివాసరావు మూత్రవిసర్జన చేసి కారు వద్దకు వచ్చేందుకు రోడ్డు దాటుతుండగా హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళ్తున్న ట్రావెల్స్ బస్సు అతడిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శ్రీనివాసరావు అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని కోదాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి అల్లుడు వెలగంశెట్టి శ్రీహరిచైతన్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని..



జాదవ్‌వాస్‌రాజ్ (ఫైల్)

మిర్యాలగూడ అర్బన్: గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన మిర్యాలగూడ పట్టణంలోని ఈదులగూడ చౌరస్తా వద్ద శనివారం తెల్లవారుజామున జరిగింది. మిర్యాలగూడ వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ పట్టణంలోని ఈదులగూడ కాలనీకి చెందిన జాదవ్‌వాస్‌రాజ్(39) శనివారం తెల్లవారుజామున బహిర్భూమికి వెళ్తూ రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతడి తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి సోదరుడు హరీశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మిర్యాలగూడ వన్‌టౌన్ ఎస్‌ఐ సుధీర్ పేర్కొన్నారు.

అభివృద్ధిలో మిల్లర్లు భాగస్వాములు కావాలి

- మిర్యాలగూడ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ: మిర్యాలగూడ అభివృద్ధిలో రైస్ మిల్లర్లు భాగస్వాములు కావాలని స్థానిక ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం మిర్యాలగూడ పట్టణంలోని ఓ హోటల్‌లో నిర్వహించిన రోటరీ క్లబ్ నూతన కమిటీ ప్రమాణస్వీకారోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలు, ఆస్పత్రుల బలోపేతానికి మిల్లర్లు ముందుకు రావాలని కోరారు. అనంతరం నూతన కమిటీ సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు రేపాల అంతయ్య, ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలిగా ఎన్నికైన రేపాల అనంతలక్ష్మీని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే శ్రీనివాస్, రాజశేఖర్‌రెడ్డి, రమేష్, నరేందర్, మౌనిక, శ్రీనివాస్, సుమిత్రాకుమార్, మధుసూదన్, కుశలయ్య, శ్రీనివాస్, వెంకటరమణచౌదరి, వెంకటేశ్వర్లు, భవాని, ఉమాశేఖర్, హరినాథ్, రంజిత్, లక్ష్మీనారాయణ, నవీన్, రాజేందర్, దయాకర్, సీతాకుమారి, సుబ్రహ్మణ్యం, లవకుమారి, చిల్లంచర్ల శ్రీనివాస్, రామ్మూర్తి, పురుషోత్తం, వెంకటేశం పాల్గొన్నారు.

సిద్ధమవుతున్న ప్రచారశాఖ కార్యాలయం



రథశాల పక్కన సిద్ధమవుతున్న కార్యాలయం

యాదగిరిగుట్ట: యాదాద్రి ఆలయ మాడ వీధిలో రథశాల పక్కన ప్రచారశాఖ కార్యాలయాన్ని అధికారులు సిద్ధం చేస్తున్నారు. ప్రస్తుతం పడమటి అష్టభుజి ప్రాకార మండపంలో తాత్కాలికంగా ప్రచారశాఖను అధికారులు ఏర్పాటు చేశారు. భక్తులను ఆకర్షించేలా ఆధ్యాత్మిక రూపాలతో ఈ ప్రచారశాఖ కార్యాలయాన్ని సిద్ధం చేస్తున్నారు.